సాక్షి సిద్దిపేట

గురువారం ׀ 25 ׀ ఏప్రిల్ ׀ 2024



ఆరోగ్య 'మస్తు'

మహిళా క్లినిక్‌లు వారి ఆరోగ్యానికి భరోసానిస్తున్నాయి.

వివరాలు IIలో ▸



గుంత.. తీర్చేను నీటి చింత

ఇంకుడు గుంతల నిర్మాణం చేపడితే భూగర్భ జలం పెరుగుతుంది.

వివరాలు IIలో ▸

29, 30 తేదీల్లో స్టాండింగ్ సమావేశాలు

సిద్దిపేటజోన్: జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశాలు ఈనెల 29, 30 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈఓ రమేశ్ తెలిపారు. చైర్‌పర్సన్ రోజాశర్మ అధ్యక్షతన సమావేశాలు జరుగుతాయన్నారు. సభ్యులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని సూచించారు.

న్యూస్‌రీల్

అఖిల్‌కు కాలనీవాసుల సన్మానం



అఖిల్‌ను సన్మానించిన క్రాంతినగర్ కాలనీ వాసులు

కొండపాక(గజ్వేల్): సివిల్స్‌లో ర్యాంక్ సాధించిన బుద్ది అఖిల్‌ను క్రాంతినగర్ కాలనీ వాసులు సన్మానించారు. బుధవారం అఖిల్‌తో పాటు తల్లిదండ్రులను కాలనీ వాసులు శాలువాతో ఘనంగా సత్కరించారు. తమ కళ్లెదుటే ఆడుకున్న అఖిల్ కలెక్టరు ఉద్యోగం సాధించడం గర్వకారణమంటూ మిఠాయిలు పంచుకున్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

సమాజ చైతన్యానికి సాహిత్యం అవసరం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సమాజ చైతన్యానికి సాహిత్యం అవసరమని జాతీయ సాహిత్య పరిషత్ కవులు అన్నారు. బుధవారం సిద్దిపేటలో జరిగిన జాతీయ సాహిత్య పరిషత్ (జాసాప) సమావేశంలో కవులు మాట్లాడారు. నేడు సమాజం మంచి మార్గంలో పయనించాలంటే మంచి సాహిత్యం అవసరమన్నారు. అందుకు యువత కలం కదిలించి వినూత్నమైన ఆలోచనతో మారుతున్న కాలానికి అనుగుణంగా రచనలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో జాసాప అధ్యక్షుడు ఎన్నవెల్లి రాజమౌళి, ప్రధాన కార్యదర్శి ఉండ్రాళ్ళ రాజేశం, ఐత చంద్రయ్య పాల్గొన్నారు.

నేటి నుంచి ఓపెన్ స్కూల్ పరీక్షలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఓపెన్ స్కూల్ సొసైటీ పదోతరగతి, ఇంటర్ పరీక్షలు గురువారం నుంచి నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. మే 2వరకు జరిగే ఈ పరీక్షలు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మధ్యాహ్నం 2.30గంటల నుంచి సాయంత్రం 5.30గంటల వరకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పారుపల్లి, గజ్వేల్, చేర్యాల (బి–సెంటర్), హుస్నాబాద్‌లలోని సెంటర్లలో పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. అలాగే ఇంటర్మీడియెట్ పరీక్షలు సిద్దిపేట, గజ్వేల్, చేర్యాల (ఏ–సెంటర్), హుస్నాబాద్‌లలో నిర్వహిస్తున్నామన్నారు. పదో తరగతి పరీక్షలకు 831 మంది, ఇంటర్మీడియెట్ పరీక్షలకు 1133 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రానికి విద్యార్థులు గంట ముందు చేరుకోవాలన్నారు.

ఎంపీ ఎన్నికల్లో సత్తా చాటుదాం

డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి



పార్టీలో చేరిన వారితో నర్సారెడ్డి తదితరులు

గజ్వేల్: మెదక్ ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలని డీసీసీ అధ్యక్షుడు ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం గజ్వేల్‌లోని తన నివాసంలో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం నర్సారెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ తొమ్మిదిన్నరేళ్ల పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో నేడు ప్రజాపాలన సాగుతున్నదని అన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా ఆరు గ్యారంటీలను చిత్తశుద్ధితో అమలు చేస్తున్న ఘనత కాంగ్రెస్‌కు దక్కిందన్నారు. ఇదే విషయాన్ని క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించి కాంగ్రెస్‌కు భారీ మెజార్టీ వచ్చేలా కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు గంగిశెట్టి రాజు, నాచారం ట్రస్టుబోర్డు మాజీ డైరెక్టర్ నంగునూరి సత్యనారాయణ, బీఆర్‌ఎస్ నాయకులు రేగొంగ, ఆంజనేయులుగౌడ్ తదితరులు చేరారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి నాయిని యాదగిరి, కాంగ్రెస్ మండలశాఖ అధ్యక్షుడు మల్లారెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల్లో సమన్వయంతో పనిచేయండి

ములుగు(గజ్వేల్): ఎంపీ ఎన్నికల్లో కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేసి పార్టీ అభ్యర్థి విజయానికి కృషిచేయలని డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి కోరారు. బుధవారం అచ్చాయిపల్లికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు పలువురు నర్సారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. నర్సారెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే పార్టీ ధ్యేయమన్నారు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ సలీం, నాయకులు పాల్గొన్నారు.

53 శాతమే ఉత్తీర్ణత

నిరాశ పరిచిన ఇంటర్ ఫలితాలు

- రాష్ట్ర వ్యాప్తంగా 28వ స్థానంలో జిల్లా
- బాలురకంటే బాలికలే ముందంజ

సిద్దిపేటఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ ఫలితాలు ఈసారి నిరాశపరిచాయి. బుధవారం వెలువడిన ఫలితాల్లో గతేడాది 65 శాతం ఉత్తీర్ణత సాధించగా ఈసారి 53 శాతమే ఉత్తీర్ణత నమోదైంది. ఈసారి కూడా అబ్బాయిలకంటే బాలికలు ముందు వరుసలో నిలుస్తున్నారు. జనరల్ విభాగం ద్వితీయ సంవత్సరంలో గతేడాది రాష్ట్ర వ్యాప్తంగా 11వ స్థానంలో నిలవగా ఈ సారి 28వ స్థానానికి పడిపోయింది. ఫస్టియర్‌లో గత ఏడాది 15వ స్థానంలో ఉంటే ఇప్పుడు 29వ స్థానానికి దిగజారింది. ఇక ఒకేషనల్ విభాగం ఫస్టియర్‌లో 33వ స్థానానికి, ద్వితీయ సంవత్సరంలో 32వ స్థానానికి పడిపోయింది. ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలకు చెందిన పలువురు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి భేష్ అనిపించుకున్నారు. పట్టణంలోని మాస్టర్ మైండ్ కళాశాలకు చెందిన ఎంపీసీ ప్రథమ సంవత్సరం విద్యార్థిని కావ్య 468/470 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయి ర్యాంకును సొంతం చేసుకున్నారు. ర్యాంకు సాధించిన కావ్యను కళాశాల యాజమాన్యం అభినందించింది.



కావ్య (ఎంపీసీ ప్రథమ) 468/470



ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ఫలితాల వివరాలు..

జనరల్ విభాగం ప్రథమ సంవత్సరంలో బాలబాలికలు మొత్తం 7,541 మంది విద్యార్థులకు గాను 3,678 మందితో 49% ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 7,361 విద్యార్థులకు గాను 61.08 శాతంతో 4,496 మంది ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్ విభాగం ఫస్టియర్‌లో 2,677 మంది విద్యార్థులకు గాను 1,135 మందితో 42.40% ఉత్తీర్ణత నమోదు అయ్యింది. ఇక ద్వితీయ సంవత్సరంలో 2,461 మంది విద్యార్థులకు 1,329 మందితో 54% ఉత్తీర్ణత నమోదు చేశారు. జనరల్, ఒకేషనల్ ప్రథమ సంవత్సరంలో 10,218 మంది బాలబాలికలకు గాను 4,813 మంది ఉత్తీర్ణతతో 47.10 శాతం సాధించారు. ఇక జనరల్, ఒకేషనల్ ద్వితీయ సంవత్సరం 20,040 బాలబాలికలు పరీక్షలు రాయగా 53% ఉత్తీర్ణత నమోదు చేశారు.

గురుకులంలో మెరికలు

వర్గల్(గజ్వేల్): ఇంటర్మీడియట్ ఫలితాల్లో వర్గల్ జ్యోతిబాపూలే గురుకుల విద్యార్థినులు చక్కని ప్రతిభతో సత్తా చాటారు. ద్వితీయ సంవత్సరం 139 మంది బాలికలు పరీక్ష రాయగా 134 మంది ఉత్తీర్ణతతో 96.4 శాతం ఫలితాలు నమోదుచేశారు. ఎంపీసీలో ఆర్ కీర్తన(983), సీహెచ్ నందిని(980), డి. అక్షయ(973), బైపీసీలో ఎం. దివ్య (963), ఎం. అక్షయ(960), వి. సాయిసృజన(948), ఎంఈసీలో వై. నితిష(972), బి.మధులత(966), కె.భార్గవి(963), సీఈసీలో ప్రవళిక(970), మహేశ్వరి(953), జే గాయత్రి(949), హెచ్ఈసీలో నందిని(946), ఆర్.కవిత(936), డి.శిల్ప(935) ఆయా గ్రూపులలో టాపర్లుగా నిలిచారు. ఇంటర్ ప్రథమ పరీక్షల్లో 151 మందికి 141 మంది విద్యార్థినుల ఉత్తీర్ణతతో 93.4 శాతం ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి తెలిపారు.



నేడు అమిత్‌షా రాక

- 14 యేళ్ల తర్వాత సిద్దిపేటకు అగ్రనేత
- సిద్దిపేట డిగ్రీ కళాశాల మైదానంలో 30 వేల మందితో బహిరంగ సభ

బీజేపీ శంఖారావం

సాక్షి, సిద్దిపేట: రాష్ట్రంలో ఎంపీ ఎన్నికల శంఖారావాన్ని బీజేపీ సిద్దిపేట నుంచే పూరించనుంది. ఈ నేపథ్యంలో గురువారం కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా రానున్నారు. పార్టీ అగ్రనేత వస్తుండటంతో ఒక్కసారిగా పొలిటికల్ హీట్ పెరిగింది. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన తర్వాత అమిత్ షా తొలిసారిగా తెలంగాణకు వస్తున్నారు. సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఎన్నికల ప్రచార సభలో పాల్గొంటారు. బీఆర్‌ఎస్‌కు పట్టున్న ప్రాంతమైన మెతుకు సీమలో బీజేపీ పాగా వేసేందుకు ప్రణాళికను రూపొందించారు. అందులో భాగంగానే బహిరంగ సభలో అమిత్ షా పాల్గొంటారు.

బీజేపీ అగ్రనేతలు..

14 యేళ్ల క్రితం ఎల్‌కే అద్వానీ సిద్దిపేటకు వచ్చారు. మళ్లీ ఇన్నాళ్లకు సిద్దిపేటకు బీజేపీ అగ్రనేత వస్తున్నారు. మెదక్ స్థానంపై బీజేపీ జెండా ఎగరవేయాలని పట్టుదలతో కేంద్ర నాయకత్వం ముందుకు సాగుతోంది. అందులో భాగంగా ప్రత్యేక దృష్టిని సారించారు.

భారీ బహిరంగ సభ

సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేశారు. 30వేల మందితో సభ నిర్వహిస్తున్నామని పార్టీ వర్గాలు తెలిపాయి. ఇందు కోసం ముమ్మరంగా ఏర్పాట్లు చేశారు. పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.

గంటన్నర పాటు ఇక్కడే..

సిద్దిపేట జిల్లా కేంద్రంలో గంటన్నర పాటు అమిత్‌షా ఉండనున్నారు. ఉదయం 9గంటలకు ఢిల్లీ ఎయిర్ పోర్ట్ నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరుతారు. 11.10 గంటలు బేగంపేటకు.. అక్కడి నుంచి సిద్దిపేటకు చేరుకుంటారు. 11.55 గంటలకు డిగ్రీ కళాశాల గ్రౌండ్‌కు చేరుకోనున్నారు. బహిరంగ సభ ముగిసిన అనంతరం భువనేశ్వర్‌కు బయలు దేరి వెళ్తారని పార్టీ వర్గాలు తెలిపాయి.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న రఘునందన్ రావు

ఏర్పాట్ల పరిశీలన

డిగ్రీ కళాశాలలో బీజేపీ సభ నేపథ్యంలో బుధవారం సాయంత్రం ఏర్పాట్లను బీజేపీ ఎంపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్ రావు పరిశీలించారు. మెదక్ స్థానంపై బీజేపీ జెండా ఎగరవేస్తామన్నారు. ఈ సభకు కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పరిశీలించిన వారిలో బీజేపీ నాయకులు గురువారెడ్డి, మెదక్ ప్రభారీ లక్ష్మీనర్సయ్య, సంఘమేశ్వర్, మార్కండేయులు, సతీష్ పాల్గొన్నారు.

అనిల్, షెట్కార్ నామినేషన్



నామినేషన్ దాఖలు చేస్తున్న షెట్కార్, దామోదర, షబ్బీర్‌అలీ



నామినేషన్ దాఖలు చేస్తున్న అనిల్, ఎమ్మెల్యే హరీశ్‌రావు



నామినేషన్ దాఖలు చేస్తున్న వెంకట్రామిరెడ్డి

- జహీరాబాద్ లోక్‌సభ పరిధిలో మొత్తంగా 10 నామినేషన్లు
- నేటితో ముగియనున్న తొలిఘట్టం

సంగారెడ్డి టౌన్: కాంగ్రెస్ నుంచి సురేష్ షెట్కార్ రెండు సెట్లు , బీఆర్‌ఎస్ నుంచి గాలి అనిల్ కుమార్ నామినేషన్లు దాఖలు చేశారు. బుధవారం కలెక్టర్ క్రాంతికి తమ నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఆయన వెంట మంత్రి దామోదర, షబ్బీర్‌అలీ తదితరులు ఉన్నారు. ఇంకా ధర్మసమాజ్ పార్టీ దేవ శిఖామణి టిట్లా, రాష్ట్ర సామాన్య ప్రజా పార్టీ మహమ్మద్ మున్వర్ హుస్సేన్, బహుజన సమాజ్ పార్టీ బాల్ రాజు బట్టేన్కి, స్వతంత్ర అభ్యర్థులుగా జైపాల్ నాయక్, తలారి అశోక్, రమేష్ సజ్జాపూర్, ఎండీ యాకూబ్ షరీఫ్, గొల్ల మాణయ్యలు కూడా నామినేషన్లు దాఖలు చేశారు. కాగా, జహీరాబాద్ లోక్‌సభ స్థానానికి అత్యధికంగా 10 నామినేషన్లు దాఖలయ్యాయని తెలిపారు. గురువారంతో నామినేషన్ల పర్వం ముగియనుంది.

మెదక్ కలెక్టరేట్: బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి పి.వెంకట్రామిరెడ్డి రెండు నామినేషన్లు దాఖలు చేశారు. మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి, ఎమ్మెల్యేలు సునీతారెడ్డి, మహిపాల్‌రెడ్డిలు ఆయన వెంట ఉన్నారు.

వెంకన్న సాక్షిగా మాట ఇస్తున్నా..

నంగునూరు(సిద్దిపేట): కోనాయిపల్లి వేంకటేశ్వరుని సాక్షిగా మాట ఇస్తున్నా.. రూ.వంద కోట్లతో ట్రస్టు ఏర్పాటు చేసి నిరుపేదలకు సేవ చేస్తానని బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి అన్నారు. బుధవారం కోనాయిపల్లిలో స్వామి వారి చెంత నామినేషన్ పత్రాలను ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ రూ.వంద కోట్లతో ట్రస్టు ఏర్పాటు చేసి విద్యార్థుల చదువులకు ఆర్థిక సహాయం చేస్తానన్నారు. తనను గెలిపిస్తే ప్రగతికి బాటలు వేస్తానన్నారు.



కోనాయిపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో వెంకట్రామిరెడ్డి పూజలు

గులాబీ కంచుకోటలపై గురి!

- సిద్దిపేట, గజ్వేల్‌లపై కాంగ్రెస్, బీజేపీల దృష్టి
- బీఆర్‌ఎస్‌కు ఇవి గట్టి పట్టున్న నియోజకవర్గాలు
- వీలైనంత ఎక్కువ ఓటింగ్ శాతం కోసం యత్నాలు
- అత్యధిక ఓట్లున్న పటాన్‌చెరు పైనా..



గజ్వేల్, సిద్దిపేట బీఆర్‌ఎస్‌కు గట్టి పట్టున్న నియోజకవర్గాలు. కేసీఆర్, హరీశ్‌రావులు ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ ప్రాంతాలపై కాంగ్రెస్, బీజేపీలు దృష్టి సారించాయి.

బీఆర్‌ఎస్ కంచుకోటల్లో ఓట్లు కొల్లగొట్టాలని యత్నిస్తున్నాయి. పార్టీలో చేరికలను ప్రోత్సహించడం, సామాజిక వర్గాలవారీగా ఓటు బ్యాంకును ఆకట్టుకోవడంలాంటి ప్రయత్నాలు ముమ్మరంగా జరుగుతున్నాయి.

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: బీఆర్‌ఎస్ పార్టీకి కంచుకోటలుగా ఉన్న సిద్దిపేట, గజ్వేల్ నియోజకవర్గాలపై ప్రత్యర్థి పార్టీలు ప్రత్యేక దృష్టి సారించాయి. బీఆర్‌ఎస్‌కు అత్యధిక మెజారిటీ ఇస్తున్న ఈ నియోజకవర్గాల్లో పాగా వేయడం ద్వారా ఈ లోక్‌సభ ఎన్నికల్లో గెలుపు తీరాలకు చేరడం సులభమవుతుందని కాంగ్రెస్, బీజేపీలు భావిస్తున్నాయి. ఈ రెండు చోట్ల ఓటింగ్ శాతాన్ని వీలైనంత ఎక్కువగా పెంచుకునేందుకు ఉవ్విళ్లూరుతున్నాయి. ఇందుకోసం ఈ రెండు పార్టీలు ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తున్నాయి. బీఆర్‌ఎస్‌కు చెందిన ముఖ్యనేతలను పార్టీలో చేర్చుకోవడంతో స్థానికంగా పట్టు సాధించే ప్రయత్నాలు చేస్తోంది. అలాగే ఆయా నియోజకవర్గాల్లో పట్టున్న సామాజికవర్గాల ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి.

నాలుగు నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సిద్దిపేటలో టి.హరీశ్‌రావుకు 58.17 శాతం ఓటింగ్ సాధించగా.. 82,308 ఓట్ల మెజారిటీ దక్కింది. కేవలం 12.79 శాతం ఓట్లతో కాంగ్రెస్, బీజేపీలు ఇక్కడ దరిదాపుల్లో కూడా లేవు. అయితే ఈసారి ఎలాగైనా సిద్దిపేటలో ఓటింగ్ శాతాన్ని పెంచుకోవాలని ఈ రెండు పార్టీలు ప్రయత్నాల్లో ఉన్నాయి. ఇటు గజ్వేల్‌లో కూడా బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ 48.05 శాతం ఓటింగ్‌తో 45,031 ఓట్ల మెజారిటీ సాధించారు. ఇక్కడ బీజేపీకి 28.68 శాతం ఓట్లు, కాంగ్రెస్‌కు 14.01శాతం ఓట్లు వచ్చాయి. ఇలా రెండు చోట్ల పార్టీ ఓటింగ్ శాతం పెంచుకోగలిగితే విజయం సాధించేందుకు అవకాశాలున్నాయని పార్టీలు భావిస్తున్నాయి. ఈ క్రమంలో ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని మంత్రి కొండా సురేఖ ఇటీవల పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశాల్లో ప్రస్తావించారు. ఇటు బీఆర్‌ఎస్ కూడా తన పట్టును నిలుపుకునేందుకు చర్యలు తీసుకుంటోంది. అసెంబ్లీ ఎన్నికల కంటే ఎక్కువ ఓటింగ్ సాధించేలా చర్యలు చేపట్టింది.

పటాన్‌చెరుపై కూడా..

మెదక్ లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో పటాన్‌చెరు అసెంబ్లీ సెగ్మెంట్‌లో అత్యధికంగా ఓటర్లు ఉన్నారు. 4.07 లక్షల మంది ఓటర్లు ఈ నియోజకవర్గంలో ఉన్నారు. మిగిలిన ఆరు చోట్ల సగటున 2.5 లక్షల లోపే ఓటర్లు ఉన్నారు. అన్నింటి కంటే సుమారు 1.5 లక్షల ఓట్లు అధికంగా ఉన్న ఈ నియోజకవర్గం ఈ లోక్‌సభ ఎన్నికల్లో కీలకం కానుంది. దీంతో బీఆర్‌ఎస్‌తో సహా కాంగ్రెస్, బీజేపీలు కూడా ఈ నియోజకవర్గంపై దృష్టి సారించాయి. ఇక్కడ ప్రచారంపై ప్రత్యేక దృష్టి పెట్టాయి. కాగా కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థులిద్దరూ నీలం మధు, వెంకట్రామిరెడ్డి కూడా ఈ అసెంబ్లీ స్థానానికి చెందినవారు కావడం కొంత కలిసొస్తుందని ఇద్దరు భావిస్తున్నారు.

నాకు నేనే పోటీ..!

ప్రత్యర్థులు అసలు పోటీలోనే లేరు

- ఇక్కడ బీఆర్‌ఎస్ 'గాలి' వీస్తోంది
- సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టులు పూర్తి చేయిస్తా
- జహీరాబాద్‌ను మోడల్ సిటీగా తీర్చిదిద్దుతా
- చెరకు పంటకు గిట్టుబాటు ధర ఇప్పిస్తా
- సాక్షి ఇంటర్వ్యూలో జహీరాబాద్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్



'ఈ ఎన్నికల్లో నాకు నేనే పోటీ. ప్రత్యర్థులు చాలా దూరంలో ఉన్నారు. జహీరాబాద్ నియోజకవర్గ పరిధిలో బీఆర్‌ఎస్ 'గాలి'వీస్తోంది. ఎంపీగా గెలిచాక జహీరాబాద్ ప్రాంతాన్ని మోడల్ సిటీగా తీర్చిదిద్దుతా. నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తా. చెరకు పంటకు సరైన గిట్టుబాటు ధర ఇప్పించేందుకు కృషి చేస్తా. వ్యవసాయ ఉత్పత్తులు తక్కువ ధరకు విక్రయించుకోకుండా నిల్వ చేసుకునేందుకు కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేస్తా. బసవేశ్వర, సంగమేశ్వర లిఫ్ట్ ప్రాజెక్టులను పూర్తి చేయిస్తానని'' బీఆర్‌ఎస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ తెలిపారు. సాక్షికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలను పేర్కొన్నారు. – పటాన్‌చెరు

☛ మీరు కాంగ్రెస్‌ను వీడటం.. ఆ పార్టీ అధికారంలోకి రావడంతో పొరపాటు చేశామన్న బాధ ఉందా..?

ఎలాంటి బాధా లేదు. నేను తొలి నుంచి తెలంగాణ వాదిని.. ఉద్యమకారుడిని. బీఆర్‌ఎస్‌లోనే నా రాజకీయ ప్రస్థానం మొదలైంది. పటాన్‌చెరు ప్రాంతంలో వంద రోజులకు పైగా రిలే నిరాహార దీక్షలు నిర్వహించాను. 2018 తర్వాత కాంగ్రెస్‌లోకి వెళ్లికొద్ది రోజులు మాత్రమే అందులో ఉన్నా. అయితే బీఆర్‌ఎస్ నాకు తల్లి లాంటి పార్టీ. మళ్లీ కేసీఆర్‌తో కలిసి పని చేయడం ఆనందంగా ఉంది. టికెట్ ఇచ్చినందుకు పార్టీకి రుణపడి ఉంటా. ప్రజలకు సేవ చేయాలనే ఒకే ఒక్క లక్ష్యం నాది.

☛ బీఆర్‌ఎస్‌లో క్యాడర్ సహకరిస్తుందా..?

అందరి సహాయ సహకారాలు అందుతున్నాయి. జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో బీఆర్‌ఎస్‌కు మంచి పట్టుంది.

☛ మీకు ప్రధాన పోటీ ఎవరితో ఉంది..?

పోటీనా? ఎవరితోనూ లేదు. పోటీ ఇచ్చే స్థితిలో ఏ పార్టీ అభ్యర్థి లేరు. బీఆర్‌ఎస్ మండల స్థాయిలో ఏర్పాటు చేసిన సమావేశాలకు వస్తున్నంత జనం కాంగ్రెస్, బీజేపీల నియోజకవర్గ స్థాయి సమావేశాలకు రావడం లేదు. ప్రచారంలోనే ఎవరూ పోటీ ఇవ్వడం లేదు.

☛ ఎంపీగా గెలిస్తే మీ ప్రణాళిక ఏమిటి..?

నాకు ఈ ప్రాంత సమస్యలపై పూర్తి అవగాహన ఉంది. కేసీఆర్ ఆశీర్వాదంతో ఎంపీగా గెలిచి జహీరాబాద్ ప్రాంతాన్ని మోడల్ సిటీగా తీర్చిదిద్దుతా. నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తా. నాకు డబ్బు సంపాదించే అవసరమే లేదు. ఆర్థికంగా బాగానే ఉన్నా. మిగిలిన జీవితం అంతా ప్రజాసేవకే అంకితం చేయాలనే సదుద్దేశంతో రాజకీయాల్లోకి వచ్చా. జహీరాబాద్ ప్రజలకు నా జీవితం అంకితం చేస్తా. ఎవరూ ఊహించని విధంగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తాను. అన్ని వర్గాలకు అందుబాటులో ఉండి సేవ చేస్తా.

☛ రైతాంగ సమస్యలపై ఏం చర్యలు తీసుకుంటారు?

నేను రైతును. జహీరాబాద్‌లో పొలం ఉంది. గతంలో ఎవరూ పండించని విధంగా స్ట్రాబెర్రీస్ పండించాను. వ్యవసాయంలో ప్రయోగాలు చేయడం అలవాటు. ఆర్గానిక్ కూరగాయలు పండించాను. ఇప్పుడేమో పత్తి పంట వేశాను. కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలకు, నాయకులకు రైతాంగ సమస్యలపై ఎలాంటి అనుభవమూ లేదు. నేటికీ వరి కొనుగోలు చేయడం లేదు. రైతు బంధు ఎప్పుడివ్వాలో తెలియదు. ఆగస్టులో రైతు బంధు వేస్తే ఏం లాభం. సాగుబడికి నిధులు రైతులకు ఎప్పుడు కావాలో కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలియదు. పంట చేతికొచ్చిన తర్వాత రైతు పడే బాధ తెలియదు. బీజేపీ రైతులను ఏకంగా చంపేసింది. సమస్యలను పరిష్కరించక పోగా సమస్యలను పరిష్కరించండని అడిగిన అభ్యుదయ రైతులను తుపాకీ గుళ్లకు బలిచ్చింది.

☛ రైతుల కోసం ఏం చేస్తారు?

ఈ ప్రాంతం వ్యవసాయోత్పత్తులను రైతులు.. సీజన్‌లో తక్కువ ధరకు అమ్ముకోకుండా కావాల్సిన కోల్డ్ స్టోరేజీలను ఏర్పాటు చేయాలి. ఆలు, అల్లం, చెరుకు రైతు సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళికలు ఉన్నాయి. వాణిజ్య పంటలే కాకుండా ఈ ప్రాంతంలో ఇంకా అనేక రకాలైన పంటలు పండించవచ్చు. ఈ నేల స్వభావం అలాంటిది. జహీరాబాద్ లోక్‌సభకు పక్కనే ఉన్న పట్టణ ప్రాంతాలకు కూరగాయలు ఇతర వ్యవసాయ ఉత్పత్తులను సరఫ రా చేయొచ్చు. చెరుకు పంటకు సరైన గిట్టుబాటు ధర ఇప్పించేందుకు కృషి చేస్తా. బసవేశ్వర, సంగమేశ్వర లిఫ్ట్ ప్రాజెక్టులను సాధించడమే ప్రప్రథమ ప్రాధాన్యతగా కృషి చేస్తా.

☛ నిరుద్యోగ యువతకు, ఉన్నత విద్య అవకాశాలకు ప్రణాళికలు?

నిరుద్యోగులు, రైతు కూలీల వలసలు ఆగాలి. వారికి ఇక్కడే ఉపాధి చూపాలి. నిమ్జ్‌లో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు ఇప్పిస్తా. తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు రావాల్సిన నవోదయ పాఠశాలలను ఏర్పాటు చేయిస్తా.

☛ అందోల్, బాన్సువాడలకు రైలు సౌకర్యం?

గతంలో ఇక్కడ పని చేసిన ఎంపీల నిర్లక్ష్యం వల్ల రైలు మార్గం ఏర్పాటు కాలేదు. సంగారెడ్డి, అందోల్ మీదుగా నిజామాబాద్, వర్నీ వైపుగా రైల్వే లేన్ వేసేందుకు కేంద్రం సర్వే నిర్వహించింది. ఆ రైలు మార్గాన్ని ఏర్పాటు చేయిస్తా.

'ఉపాధి' కూలీల సమస్యలు పరిష్కరించండి

గజ్వేల్‌రూరల్: ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేశారు. బుధవారం గజ్వేల్ మండలం జాలిగామ చెరువులో పనిచేస్తున్న ఉపాధి కూలీలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం శంకర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి కూలీలకు రూ. 300 పెంచినప్పటికీ క్షేత్రస్థాయిలో రూ.70 నుంచి రూ.100 వరకు మాత్రమే చెల్లిస్తున్నారని, ఉపాధి హామీ చట్టం ప్రకారం వేసవి కాలంలో కూలీలకు చెల్లించాల్సిన అలవెన్స్, తాగునీటి చార్జీలు, పనిముట్లను అందించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని ఉల్లంఘిస్తున్న బీజేపీని ఓడించి భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీబీఎఫ్ జిల్లా కార్యదర్శి వేణు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అప్రమత్తంగా ఉండాలి

పోలీస్ సిబ్బందికి సీపీ ఆదేశం



సమావేశంలో పోలీసు అధికారులు

సిద్దిపేటజోన్: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా గురువారం సిద్దిపేటకు రానున్న నేపథ్యంలో జిల్లా పోలీసు కమిషనర్ అనురాధ సమీక్ష సమావేశం నిర్వహించారు. బుధవారం స్థానిక విపంచి ఆడిటోరియంలో అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి, సెక్యూరిటీ వింగ్ సీఆర్పీఎఫ్ కమాండెంట్ అడిషనల్ డీసీపీ రామచంద్రరావు, సిద్దిపేట ఏసీపీ మధు, హుస్నాబాద్ ఏసీపీ సతీష్, ట్రాఫిక్ ఏసీపీ సుమన్, సీఐలు కిరణ్, లక్ష్మీబాబు ఉపేందర్, విద్యాసాగర్ శ్రీనివాస్‌లతో కలిసి సమీక్ష జరిపారు. లోక్ సభ ఎన్నికల సందర్భంగా సిద్దిపేట డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన సభకు అమిత్‌షా హాజరుకానున్నారు. ఈ క్రమంలో హెలిప్యాడ్, బహిరంగ సభ స్థలం, వాహనాల పార్కింగ్, వీఐపీ రూట్, కాన్వాయ్, గ్యాలరీలు తదితర అంశాలపై చర్చించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా బందోబస్తు చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలని సూచించారు. అన్ని విభాగాల పోలీస్ సిబ్బందితో 12 సెక్టార్ల డ్యూటీలు విభజించినట్టు తెలిపారు.

నిందితుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రవి

జహీరాబాద్ టౌన్: యువకుడిని దారుణంగా హత్య చేసిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసి కోర్టులో రిమాండ్ చేసినట్లు జహీరాబాద్ టౌన్ సీఐ రాజబోయిన రవి పేర్కొన్నారు. బుధవారం సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. హైదరాబాద్‌లో జగద్గిరిగుట్ట ప్రాంతానికి చెందిన షేక్ అన్వర్ అలీ(30) కోహీర్ మండలంలోని రాజనెల్లికి చెందిన ముస్తకిన్(22), గుర్జువాడకు చెందిన ఎండీ కైఫ్(24) ముగ్గురు మిత్రులు. షేక్ అన్వర్ ఆటోలను అద్దెకు ఇస్తుంటాడు. రాజనెల్లికి చెందిన ముస్తకిన్ ఆటో అద్దెకు తీసుకొని నడుపుతుంటాడు. ఆటో అద్దెకు తీసుకొని సమయానికి కిరాయి ఇవ్వకపోవడంతో ముస్తకిన్‌ను కలవడానికి అన్వర్ సోమవారం 22వ తేదీన కోహీర్‌కు వచ్చాడు. కోహీర్ పట్టణంలో ముగ్గురు స్నేహితులు కలిశారు. చీకటి పడడంతో ముగ్గురు స్థానిక ప్రభుత్వ బాలుర పాఠశాల ఆవరణలో మద్యం సేవించారు. అద్దె చెల్లింపు విషయంలో షేక్ అన్వర్, ముస్తకిన్‌ల మధ్య గొడవ జరిగింది. అన్వర్ వెంట తెచ్చుకున్న కత్తితో ముస్తకిన్‌పై దాడికి దిగాడు. దాడి నుంచి తప్పించుకున్న ముస్తకిన్ ఎండీ. కైఫ్ సాయంతో అన్వర్‌పై ఎదురుదాడికి దిగాడు. కత్తిని లాగేసుకొని అన్వర్‌పై ప్రతిదాడి చేయడంతో తీవ్రంగా గాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని బుధవారం నిందితులను అరెస్టు చేసి కోర్టులో రిమాండ్ చేశామని సీఐ వివరించారు.

అనారోగ్య సమస్యతో..

మహిళ ఆత్మహత్య...

పటాన్‌చెరు టౌన్: అనారోగ్య సమస్యతో బాధపడుతూ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ రాజేష్ నాయక్ కథనం ప్రకారం.. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌కు చెందిన వెంకటేశ్వరి(41) ఏడాది నుంచి అనారోగ్యంతో బాధపడుతోంది. పలు ఆస్పత్రిలో చూపించినా ఫలితం లేకుండా పోయింది. ఈ క్రమంలో మనస్తాపం చెందిన వెంకటేశ్వరి మంగళవారం అర్ధరాత్రి ఇంట్లో కిరోసిన్ పోసుకొని నిప్పు అంటించుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు మంటలార్పి ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందారు. బుధవారం మృతురాలి భర్త యాదయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గుంత.. తీరెను నీటిచింత

వర్షాభావ పరిస్థితుల వల్ల రోజురోజుకూ భూగర్భజల నీటి మట్టం తగ్గుతోంది. జిల్లాలో ఇంటికో ఇంకుడు గుంత నిర్మాణానికి మున్సిపల్ అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఇంకుడు గుంతల నిర్మాణం పాతదే అయినా, కొద్ది రోజులుగా దీనిపై పట్టింపు కరువైంది. అందువల్ల పక్కగా అమలు చేసేందుకు అధికారులు నిర్ణయించారు. ఆరుబయట, ఇళ్ల ప్రహరీలోపల, బోర్ల చుట్టు పక్కల ఇంకుడు గుంతల నిర్మాణం చేపడితే భూగర్భ జలం పెరుగుతుంది. ఇంట్లో వినియోగించే నీటిని ఒడిసి పడితేనే నీటి కరువు ముప్పును అధిగమించే అవకాశాలు ఉన్నాయి. మున్సిపాలిటీల్లో ఇంకుడు గుంతలపై సర్వే నిర్వహించి నివేదికలు పంపించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

– సదాశివపేట(సంగారెడ్డి)



మున్సిపల్ కార్యాలయం వద్ద ఇంకుడు గుంత పూడిక తీతను పరిశీలిస్తున్న, కమిషర్ ఉమ, తదితరులు

- ఇంకుడు గుంతలతో పెరుగనున్న భూగర్భ జలమట్టం
- మున్సిపాలిటీల్లో జల సంరక్షణకు అధికారుల చర్యలు
- జిల్లాలోని 8 మున్సిపాలిటీల్లో 1.15 లక్షల గృహాలు
- ఇప్పటి వరకు ఉన్నవి 2,248

సంగారెడ్డి జిల్లాలోని సదాశివపేట, సంగారెడ్డి, జోగిపేట, నారాయణఖేడ్, జహీరాబాద్, తెల్లాపూర్, అమీన్‌పూర్, బొల్లారం మున్సిపాలిటీల్లో సర్వే కొనసాగుతుంది. జిల్లాలోని 8 మున్సిపాలిటీల్లో 1.15 లక్షల గృహాలు ఉన్నాయి. వీటిలో కేవలం 2,248 ఇళ్లల్లో మాత్రమే ఇంకుడు గుంతలు ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. మున్సిపాలిటీల్లో ఇంకుడు గుంతలు ఎక్కడెక్కడ నిర్మించాలో ప్రతీ ఇంటికి వెళ్లి ఈనెల 30 వరకు సర్వే చేయనున్నారు. ఇంకుడు గుంత నిర్మించకుంటే ఎందుకు నిర్మించలేదో కారణాలు తెలుసుకుంటారు. ఎవరైతే ఇంకుడు గుంత నిర్మించుకునేందుకు ముందుకు వస్తారో ఎలా నిర్మించుకోవాలో అవగాహన కల్పిస్తారు,

ప్రభుత్వ కార్యాలయాల్లో..

2018లో ప్రభుత్వం ప్రతీ జిల్లా బడులు, భారీ భవన సముదాయాలు, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టారు. కానీ అనేక చోట్ల గుంతల నిర్మాణం అటకెక్కింది. నిర్మించిన ఇంకుడు గుంతల్లో పిచ్చిమొక్కలు, పూడికతో నిండిపోయాయి. తాజాగా ప్రభుత్వ ఆదేశాల మేరకు 300 చదరపు మీటర్లు కలిగిన ప్రతీ నిర్మాణానికి ఇంకుడు గుంత ఉండేలా మార్గదర్శకాలు జారీ అయ్యాయి. లేకుంటే రెండు వారాల్లో నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఇల్లు నిర్మించుకున్నాకే చెల్లింపులు

ఇంటి నిర్మాణం పూర్తయ్యాక ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకున్నామని యజమాని దరఖాస్తు చేసుకుంటే ఆ డబ్బులను వారి ఖాతాల్లో జమచేస్తారు. మున్సిపాలిటీల్లో కమిషనర్ల అధ్యక్షతన ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. ఇంజనీరింగ్ విభాగం అధికారులు, పట్టణ ప్రణాళిక అధికారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు కమిటీల్లో సభ్యులుగా ఉంటారు. వీరంతా క్షేత్రస్థాయిలో ఇళ్ల వద్ద పరిశీలన చేసి వాస్తవ పరిస్థితులపై నివేదిక సిద్ధం చేయాలని ప్రభుత్వం మార్గదర్శకాలు జారీచేసింది.

టీఎస్‌బీపాస్ చట్టం ప్రకారం

పట్టణాల్లో సీసీ రోడ్లు, బీటీ రోడ్ల నిర్మాణాలతో వర్షం నీరు భూమిలోకి ఇంకే పరిస్థితి లేదు. ఇళ్ల పైకప్పుల నుంచి పడిన వర్షం నీరు కూడా నేరుగా మురుగునీటి కాల్వల ద్వారా చెరువుల్లోకి వెళ్తున్నాయి. టీఎస్‌బీపాస్ చట్టం ప్రకారం ప్రతీ ఇంటికి ఇంకుడు గుంత నిర్మించాలి. గుంతకు రూ.2,500 నుంచి రూ.5 వేల వరకు మున్సిపల్ అధికారులు డిపాజిట్ తీసుకుంటారు.

తప్పనిసరిగా నిర్మించుకోవాలి

ఇంకుడు గంతల నిర్మాణంపై సర్వే చేపట్టాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినందు వల్ల సర్వే చేస్తున్నాం. వర్షం నీటితోపాటు ప్రతీరోజు వినియోగించుకునే నీటిని పొదుపు చేసుకోవాలి. ఇంటి నిర్మాణంతోపాటు ఇంటి యజమాని తప్పనిసరిగా ఇంకుడు గుంత నిర్మించుకోవాలి. భూగర్భ జలమట్టం పెంపు ఇంకుడు గంతలతోనే సాధ్యపడుతుంది.

– ఉమ, మున్సిపల్ కమిషనర్

కార్మికుల హక్కులను హరిస్తున్న కేంద్రం

జహీరాబాద్ టౌన్: కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ హక్కులను హరిస్తుందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బీ.మల్లేశ్ ఆరోపించారు. పట్టణంలోని శ్రామిక్ భవన్‌లో బుధవారం సీఐటీయూ క్లస్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పెట్టుబడుదారుల కోసం పని చేస్తుందన్నారు. కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌ల కిందికి మార్చి వారి హక్కులపై ఉక్కుపాదం మోపుతుందన్నారు. కార్మికులతో పాటు రైతులకు వ్యతిరేకంగా పనిచేస్తుందని ఆరోపించారు. రాజ్యాంగ వ్యవస్థలను ధ్వంసం చేస్తుందన్నారు. ఇన్ని దారుణాలకు పాల్పపడుతున్న బీజేపీ ప్రభుత్వానికి ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జహీరాబాద్ పారిశ్రామిక క్లస్టర్ కన్వీనర్ ఎస్.మహిపాల్, వివిధ పరిశ్రమల సీఐటీయూ నాయకులు నర్సయ్య, సందీప్ రెడ్డి, నారాయణ, బాల్ రాజ్, నరేశ్, సురేశ్, శ్రీకాంత్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మల్లేశ్

ఫెయిలైతానేమోనని విద్యార్థిని ఆత్మహత్య

ఫలితాల్లో పాసైన శ్రీజ

మర్కూక్(గజ్వేల్): ఇంటర్మీడియెట్‌లో ఫెయిల్ అవుతానని అనుమానంతో ఓ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. అయితే.. ఫలితాలు చూస్తే ఆమె పాసైంది. ఈ సంఘటన సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం పతూరు గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ మధుకర్ రెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి ఇంటర్ విద్యార్థిని శ్రీజ(17) గజ్వేల్‌లోని ఒకేషనల్ ప్రథమ సంవత్సరం పరీక్ష రాసింది. బుధవారం ఇంటర్ ఫలితాలు విడుదల అవుతున్న సందర్భంగా ఫెయిల్ అవుతానేమోనన్న భయం వెంటాడింది. ఒకవేళ ఫెయిలైతే అందరి ముందు అవమానం ఎదుర్కోవాల్సి వస్తుందని భావించి మంగళవారం రాత్రి పురుగుల మందు సేవించింది. వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి.. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం విద్యార్థిని శ్రీజ మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఫెయిల్ కావడంతో విద్యార్థి ఆత్మహత్య

రామచంద్రాపురం (పటాన్‌చెరు): ఇంటర్మీడియెట్ రెండో సంవత్సరంలో ఫెయిల్ కావడంతో మనస్తాపం చెందిన ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం మండలం కొల్లూర్‌లో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సాయితేజ గౌడ్(17) మదీన గూడలోని శ్రీ చైతన్య కళాశాలలో ఎంపీసీ చదువుకున్నాడు. బుధవారం ఫలితాలు రావడంతో అందులో ఫెయిల్ అయిన సంగతి తెలుసుకున్న సాయితేజ.. కొల్లూరులోని చెరువు కట్ట వద్ద చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

ముగ్గురు అదృశ్యం

ఇద్దరు బాలికలు, ఓ వివాహిత

పటాన్‌చెరు టౌన్: వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు బాలికలు అదృశ్యమైన ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్‌కు చెందిన ఓ బాలిక (17) మంగళవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. కూతురి అదృశ్యంపై తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదే విధంగా అమీన్‌పూర్ పరిధిలోని బీరంగూడకు చెందిన ఓ బాలిక ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

తెల్లాపూర్‌లో వివాహిత..



మమత

రామచంద్రాపురం(పటాన్‌చెరు): వివాహిత అదృశ్యమైన ఘటన తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కొల్లూర్‌లో నివాసముండే మల్లేశ్ స్థానికంగా ఓ ప్రైవేట్ పాఠశాలలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మల్లేశ్ ఈనెల 18వ తేదీన తుల్జాపూర్ వెళ్లి, తిరిగి 21న ఇంటికొచ్చాడు. మల్లేశ్‌కు ఇంట్లో భార్య మమత కనిపించలేదు. 20వ తేదీన పిల్లల ప్రోగ్రెస్ రిపోర్టు తీసుకొని వస్తానని చెప్పినట్లు వెళ్లినట్టు మల్లేశ్ తల్లి చెప్పింది. అప్పటి నుంచి మళ్లీ రాలేదని, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదన్నారు. బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ఆరుగురిపై కేసు నమోదు

కంది(సంగారెడ్డి): డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ పై దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఇంద్రకరణ్ ఎస్సై విజయ్ కుమార్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండల పరిధిలోని ఇంద్రకరణ్‌లో ఓ ప్రైవేట్ క్లినిక్‌లో అనుమతి లేకుండా మందులు విక్రయిస్తున్నారని మంగళవారం సమాచారం అందింది. డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ సహా ఉద్యోగి రవికిరణ్ రెడ్డితో కలిసి వెళ్లారు. పర్మిషన్ లేకుండా నిర్వహిస్తున్న క్లినిక్‌ను తనఖీ చేసి 45 రకాల మందులను పట్టుకున్నారు. పంచనామ చేస్తున్న క్రమంలో క్లినిక్ నిర్వాహకుడు కట్టా రవి, శ్రీనివాస్, మల్లేశం, శ్యాముల్, జైపాల్, శంకర్, ఈశ్వర్ డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ చంద్ర శేఖర్‌తో సహా ఉద్యోగి రవికిరణ్ రెడ్డిని బూతులు తిడుతూ దాడి చేశారు. బాధితుడు చంద్ర శేఖర్ ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డబ్బుల కోసమే హత్య



మాట్లాడుతున్న సీఐ మహేందర్‌రెడ్డి

జగదేవ్‌పూర్(గజ్వేల్): చికెన్ దుకాణం యజమాని హత్య కేసు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు గజ్వేల్‌రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం జగదేవ్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఈ నెల 21న రాంరెడ్డి చికెన్ దుకాణంలో పని చేస్తున్న పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన కుర్బాన్, రూబల్ (ఇద్దరు మేజర్లు) దుకాణం యజమాని మహిపాల్‌రెడ్డిని హత్య చేసిన విషయం తెలిసిందే. డబ్బు కోసమే దుకాణం వెనుక గదిలోకి పిలుచుకొని గొంతు నొక్కి చంపేశారన్నారు. అనంతరం వారు పరారయ్యారని, సోమవారం మహిపాల్‌రెడ్డి సోదరులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని గాలింపు చేపట్టామన్నారు. విశాఖపట్నంలోని రైల్వేస్టేషన్‌లో ఇద్దరు నిందితులను అక్కడి పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. బుధవారం ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు.

బావిలో పడి వృద్ధురాలు మృతి



రాజవ్వ మృతదేహం

హుస్నాబాద్‌రూరల్: ప్రమాదవశాత్తు బావిలోపడి వృద్ధురాలు మృతి చెందిన ఘటన హుస్నాబాద్ మండలం పందిల్ల గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన యామ రాజవ్వ(70) కొడుకు కనకయ్య చనిపోవడంతో మానసిక స్థితి సరిగా లేక కోడలు దగ్గరే ఉంటుంది. నాలుగు రోజుల కిందట ఇంట్లో నుంచి వెళ్లిన రాజవ్వ తిరిగా రాలేదు. మంగళవారం రైతు అంజయ్య వ్యవసాయం పనుల నిమిత్తం బావి దగ్గరకు వెళ్లి చూడగా రాజవ్వ మృతదేహం పైకి తేలి కనిపించింది. వెంటనే గ్రామస్తులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. మనుమడు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలు ఢీకొని యువతి..

చిన్నశంకరంపేట(మెదక్): ప్రమాదవశాత్తు రైలు ఢీకొని యువతి మృతి చెందిన ఘటన మిర్జాపల్లి రైల్వే స్టేషన్ సమీపంలోని శేరిపల్లి రైల్వే గేట్ వద్ద చోటు చేసుకుంది. కామారెడ్డి రైల్వే ఎస్ఐ తావు నాయక్ కథనం ప్రకారం.. నార్సింగి మండలంలోని శేరిపల్లి గ్రామానికి చెందిన పంబల్ల రమ్య (19) గతేడాది ఇంటర్ పూర్తి చేసి ఇంటి వద్దనే ఉంటుంది. తండ్రి చక్రం అనారోగ్యానికి గురై చికిత్స పొందుతుండగా రమ్యనే పొలం పనులను చూసుకుంటుంది. బుధవారం పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లి తిరిగి వస్తుండగా గూడ్స్ రైలు ఢీకొని మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మురికి గుంతలో పడి కార్మికుడు

కొల్చారం(నర్సాపూర్): ప్రమాదవశాత్తు మురికి గుంతలో పడి పారిశుద్య కార్మికుడు మృతి చెందిన ఘటన మండలంలోని రంగంపేటలో బుధవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన మాదిగ దాసు(26) పదేళ్లుగా గ్రామంలో పారిశుద్య కార్మికుడిగా పని చేస్తున్నాడు. గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం పక్కన మురికి గుంత చెత్తతో నిండి ఉంది. దాసుతోపాటు మరో ఇద్దరు గుంతను శుభ్రం చేసేందుకు అందులోకి దిగారు. చెత్తను తీసే ప్రయత్నంలో దాసు గుంతలో మునిగిపోయి ఊపిరాడక ఆపస్మారక స్థితిలోకి వెళ్లాడు. వెంటనే చికిత్స నిమిత్తం మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, పరిశీలించిన డాక్టర్లు మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి రిఫర్ చేశారు. దాసును ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు తెలిపా రు. మృతుడి భార్య ఉండగా, అతడి కుటుంబానికి ప్రభుత్వం రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ రమేశ్ కుమార్ డిమాండ్ చేశారు.

నాట్య మయూరాలు

- కూచిపూడిలో రాణిస్తున్న విద్యార్థినులు
- 25 ఏళ్లుగా నేర్పిస్తున్న మాస్టర్ సరిత



అభినయ నృత్య కళాశాలలో డాన్స్ నేర్చుకుంటున్న విద్యార్థినులు

మెదక్‌జోన్: మెదక్ పట్టణంలో విద్యార్థినులు కూచిపూడి నృత్యంలో రాణిస్తున్నారు. పాతికేళ్లుగా మెదక్ పట్టణంలో కొనసాగుతున్న ఈ డాన్స్ కోచింగ్ సెంటర్‌లో వేలాది మంది విద్యార్థినులు డాన్స్ నేర్చుకొని వివిధ స్టేజీలపై ప్రతిభ చాటుతున్నారు. మెదక్ పట్టణంలో 1998 సంవత్సరంలో కూచిపూడి డాన్స్ మాస్టర్ సరిత 'అభినయ నృత్య కళాశాల'ను ఏర్పాటు చేశారు. ఇందులో కూచిపూడి, ఫోక్ డాన్స్, వెస్టర్న్ డాన్స్‌లను నేర్పిస్తున్నారు. అత్యధికులు కూచిపూడి నేర్చుకుంటున్నారు. వారంలో రెండు రోజులు మాత్రమే (శని, ఆదివారం) శిక్షణ ఇస్తున్నారు.

కూచిపూడి నృత్యం ప్రత్యేకం..

ఇందులో ప్రధానంగా కూచిపూడి నృత్యం 3 నుంచి 5 ఏళ్ల వరకు నేర్పిస్తారు. ఇందులో డిప్లొమా పూర్తి చేయాలి అంటే 8 ఏళ్ల పాటు నేర్చుకోవాల్సి ఉంటుంది. అనంతరం ప్రభుత్వం డాన్స్‌కు సంబంధించిన డిప్లొమా సర్టిఫికెట్‌ను ఇస్తారు.

2018లో ప్రపంచ రికార్డు...

మెదక్‌లో అభినయ నృత్య కళాశాలలో డాన్స్ నేర్చుకున్న శ్రీనిజ, సౌజన్య, భువన, వంశీ 2018లో హైదరాబాద్‌లోని ఎల్‌బీస్టేడియంలో సిలికాన్ ఆంధ్ర ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కూచిపూడి నృత్యంలో పాల్గొని ప్రపంచ రికార్డు సాధించారు.

డాన్స్ అంటే ప్రాణం



ఐదేళ్లుగా ఇక్కడ కూచిపూడి నేర్చుకుంటున్నాం. గతేడాది రవీంద్ర భారతిలో డాన్స్ చేసి మెడల్స్ తీసుకున్నాం. డాన్స్ అంటే మాకు ప్రాణం.

– మేఘన శర్మ, మైత్రీ శర్మ అక్కాచెల్లెలు

25 ఏళ్లుగా నేర్పిస్తున్నా



కూచిపూడి నృత్యాన్ని వెంపట కృష్ణమూర్తి రాజు వద్ద 8 ఏళ్లపాటు నేర్చుకొని డిప్లొమా సర్టిఫికెట్‌ను పొందాను. 25 ఏళ్ల నుంచి మెదక్‌లో ఎంతో మందికి కూచిపూడి నృత్యాన్ని నేర్పిస్తున్నాను. అకాల మరణం చెందిన మా అన్నయ్య శేఖర్ గుర్తింపుగా శేఖర్ మెమోరియల్ పేరుపై ప్రతిఏటా జనవరి 19న నృత్యప్రదర్శనలు ఇస్తున్నాం.

– సరిత కూచిపూడి డాన్సర్

ఆరోగ్య 'మస్తు'



మహిళా క్లినిక్‌లు

మహిళా క్లినిక్‌లు వారి ఆరోగ్యానికి భరోసానిస్తున్నాయి. అత్యవసర, ప్రత్యేక సేవలు కూడా అందుబాటులోకి రావడంతో కొండంత ధైర్యాన్ని ఇస్తున్నాయి. కాగా ఇంకా మెరుగైన సేవలు అవసరమని గుర్తిస్తే మాత్రం జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి రిఫెర్ చేస్తున్నారు. గతంలో ప్రతి మంగళవారం మాత్రమే క్లినిక్ సేవలు అందుతుండగా ఈ ఫిబ్రవరి నుంచి ప్రతి గురువారం కూడా వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో మహిళల ఆరోగ్యానికి ధోకా ఉండదు. ఇప్పటికే సేవలు పొందిన వారు సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.

- తొలుత ప్రతీ మంగళవారం సేవలు
- ఫిబ్రవరి నుంచి ప్రతీ గురువారం కూడా
- ఇప్పటి వరకు 2,213 మందికి అందిన సేవలు



కాడిపల్లిలోని పీహెచ్‌సీ

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రమైన కౌడిపల్లిలోని పీహెచ్‌సీలో 24 గంటల ప్రసూతి కేంద్రం ఉంది. గతేడాది జూలైలో గత ప్రభుత్వం ఆరోగ్య మహిళా క్లినిక్‌ను సైతం ఏర్పాటు చేసింది. దీంతో మహిళ డాక్టర్, సూపర్‌వైజర్, ఏఎన్ఎంలు మహిళలకు ప్రత్యేక వైద్యం అందిస్తున్నారు. గతేడాది ప్రతి మంగళవారం మహిళా క్లినిక్‌లో చికిత్సలు చేస్తున్నారు. మంచి ఫలితాలు ఇవ్వడంతో ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ప్రతి మంగళవారంతోపాటు, గురువారం సైతం చికిత్సలు అందిస్తున్నారు.

సమస్యల గుర్తింపు ఇలా

పీహెచ్‌సీలో మహిళలకు సాధారణ చికిత్సలు అందిస్తుండగా మహిళా క్లినిక్‌లో మాత్రం ప్రత్యేకంగా రొమ్ము క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్, ఓరల్ క్యాన్సర్, నెలసరి రక్త స్రావం, గర్భసంచి సమస్యలు, పీసీఓడీ పరీక్షలు చేయనున్నారు. దీంతోపాటు థైరాయిడ్, హైపో థైరాయిడ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇక్కడ పూర్తి స్థాయిలో పరీక్షించి అవసరం మేరకు టీ డయగ్నోస్టిక్ ద్వారా అన్ని రకాల రక్త పరీక్షలు నిర్వహిస్తున్నారు. పరీక్షల సందర్భంగా సమస్యలను గుర్తిస్తే మరింత మెరుగైన వైద్యం కోసం బాధితులను 102 వాహనంలో ఉచితంగా జిల్లా ఆసుపత్రికి తరలించి అక్కడ స్కానింగ్, మమోగ్రామ్ పరీక్షలు చేస్తారు.

ఎంతమందికి చికిత్సలు అందించారంటే

ఇప్పటి వరకు 2,213 మంది మహిళలకు చికిత్సలు చేశారు. ఇందులో 1,147 మందికి రక్తం, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. దీంతోపాటు 2,156 మందికి రొమ్ము, 256 మందికి థైరాయిడ్, 267 సీబీపీ పరీక్షలు నిర్వహించారు. ప్రత్యేక వైద్యం అవసరాన్ని గురించిన 129 మందికి 102లో మెదక్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఇక్కడ అవసరం మేరకు స్కానింగ్ తీసి స్పెషలిస్ట్ వైద్యులతో వైద్యం అందించారు.

క్యాన్సర్ గుర్తించిన ఇద్దరికి ..

ఉమ్మడి మండలంలోని ఇద్దరు మహిళలకు మొదటి దశలోనే బ్రెస్ట్ క్యాన్సర్‌గా గుర్తించారు. దీంతో జిల్లా ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో మెరుగైన వైద్యం అందించడంతో వారి ఆరోగ్యం బాగైందని మండల వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్, డాక్టర్ ఫెర్నాజ్ తెలిపారు.

బాగా చూస్తున్నారు



కౌడిపల్లి పీహెచ్‌సీలో ఆరోగ్య మహిళా క్లినిక్‌లో వైద్యం చేయించుకున్న డాక్టర్‌తో పాటు ఇక్కడ ఉన్న వారు మంచిగా పరీక్షించి వైద్యం చేశారు. ఉచితంగా పరీక్షలు చేసి మందులు ఇస్తున్నారు. ఇతరులకు చెప్పుకోలేని సమస్యలు ఈ క్లినిక్‌లో మహిళ డాక్టర్‌కు చెప్పవచ్చు.

అజ్మీర సువర్ణ, బతుకమ్మ తండా

ఆరోగ్యంపై జాగ్రత్త ఉండాలి



మహిళలు ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయొద్దు. సమస్యను మొదట్లో గుర్తిస్తే ఇబ్బంది ఉండదు. బ్రెస్ట్, నెలసరి, థైరాయిడ్ ఇతర అనారోగ్య సమస్యలు ఉంటే పీహెచ్‌సీలో మహిళ డాక్టర్‌ను కలిసి చికిత్సలు చేయించుకోవాలి. చిన్న సమస్య అయితే ఇక్కడే వైద్యం అందిస్తాం. అవసరమైతే జిల్లా ఆసుపత్రికి పంపించి చికిత్స చేయిస్తాం.

డాక్టర్ ఫెర్నాజ్, కౌడిపల్లి

క్లినిక్‌తో ఉపయోగం



ఆరోగ్య మహిళా క్లినిక్‌తో ఆడవారికి, యువతులకు ఎంతో ఉపయోగం. ఉమ్మడి మండలంలోని మారుమూల గ్రామాలు, తండాలు ఎక్కువ. మహిళలు అనారోగ్యం సమస్యలతో ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లకుండా పీహెచ్‌సీలోని క్లినిక్‌లో చికిత్సలు చేసుకోవడం ద్వారా మెరుగైన వైద్యం అందుతుంది.

ప్రవీణ్‌కుమార్, మండల వైద్యాధికారి